

# కథ

**డి.ఉషాబాల**

# భోషాణ భాగోతం

'మన్నా తినకురా తనయ నా మాటా వినరా' అంటూ తన్మయత్వంతో పాడుతూ కృష్ణుడి బొమ్మకి తులసి మాలలల్లుతోంది బామ్మ. ఆవిడ గొంతులోని మాధుర్యం ఇంత వయసులోనూ చెక్కుచెదరలేదు. నన్ను చూసి పాట ఆపి "రారా చిట్టీ ప్రసాదం పెడతాను" అంది.

"పాట ఆపేసావేంటి పాడు" అన్నాను.

"సిటీలో ఉన్నవాళ్లు... నా లొల్లాయి పదాలు నచ్చుతాయిట్రా నీకు?"

"నేనెక్కడున్నా ఈ ఊళ్ళో నీ పాటే నాకిష్టం బామ్మా" అన్నాను.

అప్పటికే అమ్మ నూతి పళ్ళెంలో నిలబడి నన్ను త్వరగా ఆ విషయం గురించి అడగమని సౌంజ్ఞలు చేస్తోంది. నేను ఆ ప్రస్తావన ఎలా తేవాలా అని ఆలోచిస్తుంటే బామ్మే అంది. "హైదరాబాద్‌లో మేడ కొన్నావుట కదా అయిదంతస్తులది. అమ్మని, నాన్నని తీసుకెడతావటగా. ఏదో లోపాయికారిగా విన్నాలే" అంది.

"నేను కొన్నది మేడలో ఓ ఫ్లాటు మాత్రమే బామ్మా. మేడంతా నాది కాదు. రెండు పడగ్గదులున్న చిన్న యిల్లు. అమ్మా నాన్నతోపాటు నిన్నూ తీసుకుని వెడతాను వచ్చేసేయ్" అన్నాను.

"నేనా ఆదరాబాదరా హైద్రాబాదు రాను నాయనా. ఇంకా కన్నూ కాలూ బాగున్నాయ్. ఏదో కృష్ణా రామా అనుకుంటూ ఇక్కడే పడుంటాను. అసలే ఇల్లు చిన్నదంటున్నావు. నేనూ, నా భోషాణం ఎక్కడ సరిపోతాం?" ముందుమాట కాస్త గట్టిగా తరువాతి మాటలు గొణుగుతూనూ అంది. అమ్మయ్య అసలు విషయానికి వచ్చింది అనుకుంటూ "నిన్ను నాతోపాటు తీసికెళ్ళడానికి నాకే అభ్యంతరము లేదే! నాకూ నా పెళ్ళానికి సంతోషం కూడాను. కానీ నీతోపాటు తెస్తానంటున్న భోషాణంతోనే పేచీయే. దాన్ని అక్కడి యింట్లో ఎక్కడ పెట్టమంటావు?"

"అందుకే నే రానన్నానా? దాన్ని ఇక్కడే వదిలే మాటయితే నే ఛస్తే రాను. అది నా పుట్టింటి సొత్తు. కాటికి కాళ్ళు చాచిన ఈ వయసులో దీన్ని వదిలి రాను. మీరే కట్టకట్టుకుని పొండి" అంది కోపంగా ముక్కుపుటాలు ఎగబీలుస్తూ.

అమ్మ కూడా ముందు భోషాణ విషయంలో నచ్చచెప్పబోతే రయ్యిన ఇంతెత్తు లేచిందిట. అలిగి అన్నపానాలు మానిందట. అమ్మ హడిలిపోయి నాకు కబురుపెట్టింది రాయబారానికి.

"నిన్నొక్కర్తినీ ఇక్కడ వదిలి వెళ్తే నలుగురూ ఏమనుకుంటారు చెప్పు? అమ్మా, నాన్నా ఊళ్ళో తలెత్తుకోగలరా. నీ భోషాణం పట్టేంత యిల్లు కాదు బామ్మా నాది. కావాలంటే ఓ మనిషిని కాపలా పెట్టించి ఎప్పటికప్పుడు దాన్ని శుభ్రం చేయిద్దాం. సరేనా" అన్నాను. రాజీకొస్తుందేమోని.

అబ్బే ఆవిడ తాపట్టిన కుందేటికి మూడే కాళ్ళంటుంది. "నేను రావాలంటే నాతో నా భోషాణం రావాలి. లేదంటే నాకెవరూ లేరనుకుంటాను. ఇక్కడే ఉంటాను" అంది.

ఆవిడ మొండి వైఖరికి నాకొళ్ళు మండింది. అమ్మా నాన్న కూడా ఏమీ నిర్ణయించుకోలేని పరిస్థితి. అమ్మ హార్ట్ ఆపరేషనైన మనిషి. ఎన్నాళ్ళని ఇలా చాకిరీ చేస్తుంటుందని. నాదగ్గరికి వచ్చెయ్యమంటే వాళ్ళిద్దరూ సరేనన్నారు. ఇదిగో బామ్మ పెట్టిన ఫిటింగ్‌తో వాళ్ళూ ఎటూ మాట్లాడలేకపోతున్నారు.

ఆవేళ సాయంత్రం అమ్మ అరిటాకు కోసుకురమ్మంటే చాకు తీసుకుని పెరట్లోకి వెళ్ళాను. అక్కడే జాజిపూలు కోస్తున్న బామ్మ నన్ను చూసి "ఏరా చిట్టీ ఏమాలోచించావు? నాకు తెలుసులే నన్ను మీ ఊరట్టికెళ్ళడం నీకిష్టం లేదు. అవునులే ఈ పల్లెటూరి ముసలి వాసన మీ పట్నం మనుషులకి ఎలా సరిపోతుంది? అందుకనే నాకూ దానికీ మీ యింట చోటు లేదన్నావు" నేనింకా ఏం మాట్లాడకుండానే నిష్ఠుర పురాణం కంటిన్యూ చేస్తోంది.

"అయ్యో నిన్ను తీసుకెళ్ళడం గురించి కాదు బామ్మా, నాలుగడుగుల ఎత్తు, ఐదడుగుల పొడవు, మూడడుగుల వెడల్పు ఉన్న ఆ పాషాణాన్ని సారీ భోషాణాన్ని ఎక్కడ పెట్టించమంటావు?" అన్నాను ఆవిడకి కనిపించకుండా పళ్ళు కొరుకుతూ.

నేనెంత జాగ్రత్తపడ్డా నా భావాల్ని పసిగట్టింది. "ఏరోయ్ ఏంటోలా మాట్లాడుతున్నావ్. నన్నంటే అను దాన్నంటే సహించను" అంది.

"అయినా ఎక్కడ పెట్టదమంటావేరా? ఇల్లన్నాక ఓ సావిడీ, ఓ నడవా, వసారా ఇవన్నీ ఉండవూ? పోనీ అక్కడ కుదరకపోతే పెరట్లో పెట్టించు. ఇంతోటిదానికి అల్లా లబలబలాడిపోతావేంటి? మేడలు కొన్నవాడి పరిస్థితే ఇలా వుంటే డెబ్భై ఏళ్ళై పెంకుటిళ్ళలో ఉంటున్న వాళ్ళం మేమేం అనాలి?" అంటూ దీర్ఘాలు తియ్యడం మొదలెట్టింది.

భగవంతుడా ఈవిడకెలా నచ్చచెప్పాలీ అని ఏడ్చుకుంటూ పైకి ముఖానికి కాస్త నవ్వు పులుముకుని "అది మన అగ్రహారం కాదు మామ్మా భోషాణాలు, కావిడి పెట్లు, రోళ్ళూ రోకళ్ళూ మోసుకుపోవడానికి. ఓ హాలు, రెండు పడగ్గదులు. ఇల్లాలు మాత్రం వెళ్ళి వంట చెయ్యడానికి సరపడా వంటిల్లు. ఇదే అక్కడ నా ఫ్లాటు. ఇంత పెద్ద బొబ్బిలి పులి, అదే భోషాణం పట్టదు" అన్నాను నాలిక్కరుచుకుంటూ.

"ప్లీజ్ నా మాట విను. నీ మణిమాణిక్యాలు దాచుకోవడానికి ఓ గోద్రెజ్ ఐరన్ సేఫ్ కొనిపెడతానే. దాన్నిక్కడ వదిలెయ్యవే. నీకు దండం పెడతాను" అన్నాను బతిమాలే ధోరణిలో.

"నో నో నథింగ్ డూయింగ్" అంటూ గదిలోకెళ్ళి తలుపేసుకుంది. ఆవిడ పంతం నెగ్గించుకోవాలంటే అలా ఇంగ్లీషులో మాట్లాడుతూ వుంటుంది. అసలే బట్టతల అవడానికి కొద్దిదూరంలో మాత్రమే ఉన్న నేను కోపంతో రెండు గుప్పిళ్ళతో జుట్టుపీక్కోడం మినహా ఏమీ చేయలేకపోయాను, హతవిధీ ఎనభైల్లోనూ ఈవిడకింత పంతమా అనుకుంటూ.

"పోనీలేరా పెద్ద వయసులో ఎందుకు ఆవిణ్ని బాధపెట్టడం. దాన్నీ తీసుకెడదాంలే" అంటూ వచ్చింది అమ్మ.

"ఏం పెద్దదే ఇలా చంపి తింటోంది. అర్థం చేసుకోదే అవతలివాళ్ళ మాటని. అసలేం దాచింది ఆ స్విస్ బాంకులో. తాళాలెక్కడన్నాయో పట్రా తెరిచి చూద్దాం. ఏవైనా లంకె బిందెలున్నాయేమో! అందుకే వదల్నంటోంది"


"అమ్మో తాళాలే. ఆవిడ ఇంట్లో ఉన్నప్పుడు కాదు గాని ఆవిడ సాయంత్రం భజనకెళ్ళినప్పుడు వెతుకుతాను. అప్పుడు చూద్దాం"

సాయంత్రం ఆవిడలేని సమయంలో భోషాణం తెరిచాం. దాంట్లో ఉన్న సంపద చూసి బైర్లు కమ్మాయి నా కళ్ళు. కొబ్బరి చీపుళ్ళు, చాంతాడు చుట్టలు, మాడిపోయిన ట్యూబులైట్లు, ఆవిడ చిన్నప్పటి తాటాకు

బొమ్మలు, ఇత్తడి గిన్నెలు, చిరిగిపోయిన పట్టుగుడ్డలూ- ఇవీ అందులోని నిధి నిక్షేపాలు.

"వీటికోసమేనా నీ అత్తగారు దీన్ని వదలనంటోంది" కోపంతో దాని మూత ధడేల్న వేసాను. ఓ వీసెడు దుమ్ము నా కళ్ళలోకి, నోట్లోకి వెళ్ళింది. గొళ్ళెం ఊడొచ్చింది. దాన్నెలాగో నిలబెట్టి భోషాణం తెరిచిన ఆనవాళ్ళు లేకుండాచేసి బయటికి వచ్చాం.

నా యింట్లో ఫ్లోరింగ్‌కే లక్ష ఖర్చుపెట్టాను. దీన్ని ఎక్కడ పెట్టి ఈడవాలి. ఎంతమంది మనుషులు కావాలి? చిన్న పడగ్గదిలో ఇది పడుతుందా? బామ్మా, భోషాణం ఒక గది ఆక్యుపై చేస్తే మరి మేమందరం ఎక్కడుండాలి? నా ముందన్నీ ప్రశ్నలే. ఆ భోషాణాన్ని పెట్రోలు పోసి తగలెయ్యాలన్నంత కోపం వచ్చింది నాకు.



చేసేదిలేక భోషాణానికో ట్రాన్సుపోర్టు లారీ మాట్లాడి మేం ట్రైన్‌లో బయలుదేరి హైదరాబాద్ చేరుకున్నాం. అమ్మ బట్టలు తప్ప ఒక్క వస్తువూ తెచ్చుకోలేదు. సామానుతో సహా అక్కడి యిల్లు అద్దెకిచ్చేసాం. దాన్ని లిఫ్ట్‌లో పెట్టి పైకి తీసుకెళ్ళడానికి ప్రయత్నించి విఫలమయ్యాం. దాని మోతకి పదిమంది మనుషుల్ని వెదకాల్సి వచ్చింది. వాళ్ళలో ఒకడు "ఏంది సార్ గిది, పదిమంది పట్టే శవపేటిక లెక్కుంది" అన్నాడు. నాకు తిక్కరేగింది. శుభం పలకరా పెళ్ళికొడకా అంటే ఏదో అన్నాట్ట. ఈ హడావిడికి మా ఫ్లాట్స్ సెక్రటరీ పరిగెత్తుకొచ్చాడు. వాడు మా కింది ఫ్లాట్‌లోనే ఉంటాడు. వాడేదుపు వాడిది.

ఇన్ని ఇక్కట్లు పడి దాన్ని గదిలోకి చేర్చాం. భోషాణం గదిలో పెట్టాక బామ్మ మంచానికి చోటులేకుండా పోయింది. ఈ వయసులో ఆవిణ్ణి కింద పడుకోమనడం బాగుండదు. ఆవిడకి పక్క ఎక్కడ ఏర్పాటు చెయ్యాలాని ఆలోచిస్తుంటే ఆవిడే నా మనసులో మాట పట్టేసి-

"దీనిమీదే ఓ తలగడ పెట్టుకుని, దుప్పటీ పర్చుకుని పడుకోవచ్చురా చిట్టీ. నా మంచం గురించి దిగులుపడకు"

"అయ్యో క్రేన్‌తో తెచ్చేవాటిని మనుషులతో మోయిస్తున్నారా? శ్లాబ్‌కేమీ డామేజీ కాదు కదా!" అంటూ.

"అంత ఎత్తు ఎలా ఎక్కుతావే?"

"ఆ ఏవుంది ఓ కుర్చీపీట వేసుకుంటే సరి. తడవకు వీసెడు ధాన్యం దంచిన శరీరం నాది" అంది.

ఇంతలో నా ఐదేళ్ళ కూతురు పరిగెత్తుకొచ్చి "తాతమ్మా నన్నా స్టేజీ ఎక్కించవా పాట పాడతాను" అంది.

దానికీమధ్య తన లాంటి బుడతలందరూ టీవీ షోల్లో మైకులట్టుకుని పాడ్డం చూసి ఏదువ్వెనో, కర్రో మైకులాగా పట్టుకుని వచ్చీరాని పాటలు పాడేస్తోంది. ఇవాళ దానికి మైకుతోపాటు స్టేజీ కూడా దొరికింది.

తాతమ్మ, మునిమనవరాలు భోషాణం పైకి ఎక్కి కూర్చుని జుగల్ బందీ చేయడం మొదలెట్టారు.

ఎలాగో బామ్మ ఇప్పుడిప్పుడే ఈ హైరానాబాద్ (ఆవిడ భాషలో లెండి)లో జీవితానికి అలవాటు పడుతోంది. మొదట్లో కళ్ళాపి చల్లడానికి వాకిలి లేదని, వడియాలు ఎక్కడ ఎండబెట్టాలాని, మడిబట్టలకి దండెం ఏదని, తులసి కోట చుట్టూ ప్రదక్షణలు ఎలా చేయాలని మా ఆవిడ బుర్ర తిందట. ఇప్పుడు వాళ్ళిద్దరూ కూడా ఒకళ్ళకొకళ్ళు అలవాటయ్యారు. ఈ విధంగా నాలుగు తరాల ఆడవాళ్ళున్న మా యింట్లో ఓరోజు నేను ఆఫీసు నుంచి ఇంటికొచ్చేసరికి-

మా ఆవిడ గొంతు, మా బామ్మ గొంతూ షడ్జమంలో వినిపిస్తున్నాయి. ఏ విషయంలో ఈ తారాస్థాయి ఆర్గ్యుమెంట్స్ అనుకుంటూ లోపలికెళ్ళాను.

నన్ను చూస్తూనే మా ఆవిడ ముక్కు ఎగబీలుస్తూ "వచ్చారా మీ బామ్మ నిర్వాకం చూడండి. మధ్యాహ్నం పిండిమిల్లుకెళ్ళాను. అత్తయ్య గుడికెళ్ళారు. ఎవ్వరూ లేనప్పుడు చంటిదాన్ని తీసుకెళ్ళి ఆ భోషాణం మీద

కూర్చోబెట్టిందట. అది దిగబోయి కిందపడి తలకి కన్నం పడింది. నేనొచ్చేసరికే ఈవిడ దెబ్బమీద పావు కిలో కాఫీ పొడరు అద్దింది. పైగా చిన్నదెబ్బే తగ్గిపోతుంది అంది. ఎందుకో వాచిన దాని ముఖం చూసి డాక్టరు దగ్గరికి తీసుకెడితే ముక్క చివాట్లు పెట్టాడు. ఎడ్యుకేటెడ్ పీపుల్ కూడా ఇలా చేస్తే ఎలాగ? సెప్టిక్ అయితే ఏం చేస్తారంటూ. నాలుగు కుట్లు పడ్డాయి చూడండి. ఆ దిక్కుమాలిన భోషాణం దాని ప్రాణానికొచ్చింది" అంటూ ముక్కు చీదింది.

అంతవరకు మౌనంగా ఉన్న బామ్మ 'భోషాణం' అన్న మాట వినేసరికి తోక తొక్కిన తాచులా లేచింది. "అదేం చేసిందే నిన్ను. ఏదైనా అంటే నన్నను. నా భోషాణాన్నన్నావంటే మాట దక్కదు. దాందీ, నాదీ అరవై ఏళ్ళ అనుబంధం. నా పుట్టింటి సొత్తు. నీకిష్టం లేకపోతే చెప్పు తక్షణం దాంతో నేను ఇంట్లోంచి పోతాను. చిన్నప్పుడు పిల్లలు ఆడుకుంటూ పడతారు, దెబ్బలు కొట్టుకుంటారు. ఇంత కాఫీ పొడో, పసుపో అద్దేవాళ్ళం. ప్రతి చిన్నదానికి డాక్టర్ల దగ్గరికి పరిగెత్తేవాళ్ళమా ఏంటి? నాలుగు రోజులయితే ఆ దెబ్బ అదే మానిపోయేది.

ఇప్పుడో నలుసుని కనడం, అది తుమ్మినా దగ్గినా నానా హైరానా పడిపోడం మా కాలంలో ఎరగవమ్మా ఈ విడ్డూరాలన్నీ"

బామ్మ వాక్ప్రవాహానికి అడ్డువేయలేక చూస్తూ ఉండిపోయాను. నా వాలకం చూసి అమ్మే మంచినీళ్ళు తెచ్చి ఇచ్చి "చిన్న విషయమేలేరా నువ్వేం కంగారుపడకు రెస్టు తీసుకో" అంది.

ఇంతలో తలకి కట్టుతో నాన్నా అంటూ ఏడుస్తూ నాదగ్గరికి వచ్చింది పాప. ఆ క్షణంలో బామ్మ మీద, భోషాణం మీద నషాళానికి అంటే కోపం వచ్చింది. ఇంత గొడవ అవుతున్నా నాన్న మాత్రం నిమిత్తమాత్రంగా 'భాగవతం' చదువుకుంటున్నారు. అది చూసి మరింత చిర్రెత్తుకొచ్చింది. ఆ రోజు నుంచి బామ్మతో ముభావంగానే ఉంటున్నాను. మా ఆవిడైతే మాట్లాడ్డం మానేసింది.

తరువాత నాలుగు రోజులకే నేను ఓ మారుమూల పల్లెకి కేంపు కెళ్ళాను. తిరిగి రావడానికి పదిరోజులు పట్టింది.

ఆరోజు వస్తూనే హాల్లో ఈజీ చైర్లో కూర్చున్న బామ్మని పలకరించాను. బావున్నావా అంటూ.

"ఆ ఏం బాగు నాయనా కరి కాలు మకరి పాలయినట్టు నా భోషాణం ధర్మమా అని నా కుడి కాలు విరిగింది. అదే ఫ్రాక్చరట. మూడు వారాలు సిమ్మెంటు కట్టు. అతుక్కోకపోతే ఆపరేషన్ చెయ్యాల్ట. నడవడానికి లేని బతుకైపోయింది" అంది ముక్కెగబీలుస్తూ.

"అరె ఎలా జరిగింది?"

"ఆ రోజు బాలేపోతే తాడు పామై కరుస్తుందని మొన్నరాత్రి బాత్రూముకి వెడదామని లేచి భోషాణం మీంచి దిగబోయి కిందపడ్డాను. ఏమాట కామాటే- వెంటనే మీ ఆవిడ డాక్టరు దగ్గరకి తీసుకుపోబట్టి ప్రాణమైనా నిలిచింది" అంది.

"నీ ప్రాణానికేం ప్రాబ్లమ్ లేదుకానీ కాస్త స్నానం చేసి వస్తాను. మాట్లాడుకుందాం" అంటూ బెడ్రూంలోకి వెళ్ళాను.

గుమ్మంలో అడుగు పెట్టానో లేదో షాక్ కొట్టినట్టు ఆగిపోయాను. నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. నా గదిలో డబుల్ కాట్‌కి బదులు హంసతూలికాతల్పం. మాయాబజార్‌లో శశిరేఖలా దాని మీద మా ఆవిడ శయనించి ఉంది. నాలుగడుగుల ఎత్తు, ఇంచుమించు ఐదు అడుగుల వెడల్పు ఉండి రకరకాల లతలు, పూవులతో నగిషీలు చెక్కి తలకట్టున డిజైనర్ గ్లాస్ కటింగ్‌తో మిర్రర్ చుట్టూ సిల్క్ తెరలు. పట్టుపరుపు. ముట్టుకుంటేనే పూలబుట్టలో పడిన అనుభూతి.

కలలో ఉన్నట్టుగానే మా ఆవిణ్ని తట్టి లేపాను.

"అప్పుడే వచ్చేసారా" అంటూ ఆవలిస్తూ లేచి ఆ స్టూల్ ఇలా పెట్టండి. మంచం దిగాలి" అంది.

'ఓరి! నీకు ఇదో సేవా' అనుకుంటూ "ఈ హంస తూలికాతల్పం ఔక్కడిది. ఏదేని అద్భుతం జరిగి నా గృహము రాజమహలు కాలేదు కదా" అన్నాను నాటకీయంగా.

"గోంగూరేం కాదూ. మీ బామ్మ భోషాణమే ఇలా మారింది"

నోరు తెరవడం నావంతైంది.


"ఏం లేదు. మొన్నరాత్రి హడావిడి చేసిందిలెండి. దానిమీంచి దిగబోయి కాలు విరగొట్టుకుంది. ఎంతైనా ఆవిడ కాలు కదా. దెబ్బకి దెయ్యం జడిసినట్టు నా దగ్గర కొచ్చి కార్పెంటర్లని పిలిపించి ఇదిగో ఇలా మంచం చేయించి మనవడికి ప్రెజెంట్ చేసింది. ఇలాంటి మంచం మీద పడుకోవాలనే నా కోరికా తీరింది."

ఇంతలో మా పాప పరిగెత్తి మంచం ఎక్కబోయి కింద పడి నాన్నా అంటూ ఏడుపు లంకించుకుంది.

'కర్రా పోయి కత్తీ వచ్చే ఢాం ఢాం ఢాం' అన్నట్టయింది నా పరిస్థితి- ఆ మంచాన్ని చూసీ, సారీ హంస తూలికాతల్పాన్ని చూసి.

○

## నిర్మాతగా నమ్రత



బాలీవుడ్ భామ నమ్రతా శిరోద్కర్ తెలుగు హీరో మహేష్‌బాబుని పెళ్లాడాక సినిమాలకు గుడ్‌బై చెప్పేసింది కదా! ఓ కొడుక్కి తల్లి కూడా అయింది. త్వరలోనే నమ్రతా సొంతంగా ఓ డాన్స్‌షోని టీవీకోసం నిర్మించబోతున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. హిందీ చానెల్‌లోనే వుండే ఈ ప్రోగ్రామ్‌కి నమ్రతా అక్క శిల్పాశిరోద్కర్ ఓ జడ్జిగా వ్యవహరించే అవకాశం వుందిట. శిల్ప కూడా పెళ్లిచేసుకుని విదేశాల్లో సెటిలైంది. చెల్లెలి కోసం ఇండియా వస్తోందిట.